

సభకు హాజరైన జనం

# జయహో కేసీఆర్

- మిర్యాలగూడ, దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్

మిర్యాలగూడ/దేవరకొండ, అక్టోబర్ 31 : మిర్యాలగూడ, దేవరకొండలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ట్రాక్టర్లు, ఆటోలతోపాటు వివిధ వాహనాల్లో పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సభలో సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని జనం ఆసక్తిగా విని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మద్దతు పలికారు. బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలతో సభ పరిసరాలు గులాబీమయంగా మారాయి. కళాకారుల ఆటపాటలు ఉర్రూతలూగించగా..జై బీఆర్ఎస్.. జై కేసీఆర్ నినాదాలు మార్మోగాయి. 'ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దంటున్నాడు. ఆ పార్టీ అధి నాయకుడు రేవంత్ రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలంటున్నాడు.. కాంగ్రెస్‌లో డజను మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారు. బీఆర్ఎస్‌లో ఒక్కరే ముఖ్యమంత్రి.. మరీ ఏ పార్టీ కావాలి.. ఎవరు కావాలో తేల్చుకోవాలి' అని అడుగగా బీఆర్ఎస్ వెంటే మేము ప్రజలు అంటూ చేతులెత్తి నినదించారు.

### ఎమ్మెల్యే భాస్కర్‌రావును అభినందించిన సీఎం కేసీఆర్

మిర్యాలగూడ : ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ఎన్నో కీలక సమావేశాల్లో ఎమ్మెల్యే భాస్కర్‌రావు సైతం ఉంటారని, ప్రజా సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తపన పడే మంచి మనిషి ఆయన అంటూ సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యేను అభినందించారు. భాస్కర్‌రావు తనకు కుడి భుజం లాంటివాడని, 2014కు ముందు.. ఆ తర్వాత జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే భాస్కర్‌రావు కృషి ఎలా ఉందనేది ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఈ పదేండ్ల కాలంలో భాస్కర్‌రావు ఎన్నడూ తన సొంత పనిమీద తన వద్దకు రాలేదని, ఎంతసేపు నియోజకవర్గంలో లిఫ్టులు, చెక్‌డ్యాంలు, రోడ్ల నిర్మాణం అంటూ ప్రజల పనిమీదనే వచ్చి పనులు సాధించుకుంటాడని అన్నారు. భాస్కర్‌రావు తన క్యాంపు ఆఫీసుకు వచ్చినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది తుంగపాడు బంధం లిఫ్టుల సారు వచ్చారని చెప్తారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పాటుపడే ఇటువంటి నాయకుడిని ప్రజలు లక్ష మెజారిటీతో గెలిపించి ఆదరించాలని కోరారు.

# దారులన్నీ సీఎం కేసీఆర్ సభకే

## ప్రజా ఆశీర్వాద సభకు అంచనాకు మించి హాజరైన ప్రజలు

మిర్యాలగూడ, అక్టోబర్ 31: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. సీఎం కేసీఆర్ హాజరైన సభకు నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో పట్టణమంతా జనసంద్రమైంది. సభా ప్రాంగణమంతా జనంతో నిండిపోయింది. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలు ఆసక్తిగా విన్నారు. కళాకారులు ఆటపాటలతో సభకు వచ్చిన ప్రజలను అలరించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో మిర్యాలగూడ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, మరింతగా అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు చెప్పగా ప్రజలు చప్పట్లతో ఆమోదం తెలిపారు. హుజూర్‌నగర్‌లో సభకు హాజరైన తర్వాత సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 4.20 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే భాస్కర్‌రావు వారికి ఘన స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ సభాస్థలికి చేరుకోగానే ప్రజలు ఉత్సాహంగా నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో, ముఖ్య కూడళ్లలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు పార్టీ మ్యానిఫెస్టోను తెలిపేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని రాజీవ్‌చౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, రాఘువ థియేటర్, హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు గులాబి తోరణాలతోపాటు పార్టీ జెండాలను కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి యువత బైక్‌లపై, ప్రజలు డీసీఎం వ్యాన్లలో, ఆటోల్లో క్యాంపు గ్రౌండ్‌కు ర్యాలీగా చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఇసుక వేస్తే రాలనంత జనం రాగా బయట, రహదారుల వెంట కూడా జనం కనిపించారు. సభాప్రాంగణం నిండి పోవడంతో ప్రజలు రోడ్డుపైన ఉండి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. జనవాహిని చూస్తుంటే భాస్కర్‌రావు ఎమ్మెల్యేగా మరోమారు విజయం సాధించడం ఖాయమని ప్రజలు చర్చించుకున్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు తరలివస్తున్న జనంతో నిండిపోయిన మిర్యాలగూడలోని రోడ్డు

### పార్టీ క్యాడర్‌లో జోష్

పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతోపాటు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తాము ఊహించిన దానికంటే ఎక్కువగా సుమారు 80వేలకు పైగా జనం హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ సభకు తరలివచ్చినట్లు స్థానికులు తెలిపారు. తమకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్‌పై అభిమానంతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనట్లు తెలుస్తున్నది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి కళాకారులు చేపట్టిన ఆటపాటలతో సభ ఆద్యంతం హోరెత్తింది. ఇదే జోరు నవంబర్ 30 వరకు కొనసాగాలని, ఎమ్మెల్యేగా నల్లమోతు భాస్కర్‌రావును మూడోసారి అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు.

### అలరించిన కళాకారుల ఆటాపాట

సభలో కళాకారులు ఏపూరి సోమయ్య పాడిన పాటలు, కళాకారుల ఆట పాటలు అలరించాయి. గత పదేండ్లలో మిర్యాలగూడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలుపుతూ ముద్రించిన కరపత్రాలను కార్యకర్తలు సభకు వచ్చిన ప్రజలకు పంచారు. సభకు హాజరైనవారికి మజ్జిగ ప్యాకెట్లు, నీటిని కార్యకర్తలు అందించారు.

### వాహనాల దారిమళ్లింపు

ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పట్టణంతోపాటు వివిధ మండలాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పట్టణ రహదారులన్నీ ప్రజలతో నిండిపోయాయి. ప్రధానంగా సాగర్, కోదాడ రోడ్డు, మెయిన్‌బజార్, అంబేద్కర్ విగ్రహం, హనుమాన్‌పేట, రాఘువ థియేటర్, రాజీవ్‌చౌక్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా.. పోలీసులు సకాలంలో స్పందించి క్లియర్ చేశారు. భారీ వాహనాలను దారి మళ్లించడంతో ఇబ్బందులు తప్పాయి. పట్టణ శివారులోనే వాహనాలను నిలిపివేయడంతో సభకు ప్రజలు నడుచుకుంటూ వచ్చారు. దాంతో రోడ్లన్నీ సభకు వచ్చే జనాలతో కిక్కిరిసిపోయి కనిపించాయి.



మిర్యాలగూడ రూరల్ : మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామం నుంచి తరలివస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మాడ్గులపల్లి నుంచి సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మిర్యాలగూడకు తరలివెళ్తున్న అడవిదేవులపల్లి మండల వాసులు



వేములపల్లి నుంచి తరలివస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రహదారులన్నీ గులాబీ మయం

దామరచర్ల : సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై తరలి వచ్చారు. దివ్యాంగులు సైతం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. వాహనాలకు గులాబీ జెండాలు కట్టుకొని మరీ వెళ్లడంతో అద్దంకి-నార్కట్‌పల్లి, కోదాడ జడ్చర్ల రహదారులు వాహనాలతో నిండిపోయి గులాబీ మయంగా మారాయి. సీఎం కేసీఆర్ గంట ఆలస్యంగా వచ్చినా ప్రజలు ఓపికగా వేసి చూశారు. మహిళలు, చిన్న పిల్లలతో సభకు వచ్చారు. యువతులు సభాస్థలం వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. సీఎం కేసీఆర్‌ను ప్రత్యక్షంగా చూడాలనే ఉత్సాహంగా వెళ్లినప్పటికీ సభా ప్రాంగణం నిండిపోవడంతో చాలా మంది బయటే ఉండిపోయారు. ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో వాటి ముందే నిలబడి సీఎం కేసీఆర్ ప్రసాంగాన్ని విన్నారు.

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మిర్యాలగూడ గురుకుల విద్యార్థులు

మిర్యాలగూడటౌన్,అక్టోబర్31: 33వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సబ్‌జూనియర్ విభాగంలో మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవీంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29వ తేదీన భువనగిరిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు సాయి, అబ్బుత్, సిద్ధు, ఫణిచందర్‌ను ఆయన అభినందించారు. నవంబర్ 15,16,17 తేదీల్లో మెదక్ జిల్లా తుఫ్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చి గురుకులానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పిఈటీ గురువయ్య, పీడీ లక్ష్మణ్, రాములు, శంకర్‌నాయక్, చైతన్య, రామచంద్రు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఏక్తా దివస్

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్31: కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏక్తా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి ఉద్యోగులతో ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ వీరారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకుడు కరుణాకర్‌రావు, చెన్నూరి భరద్వాజ్ పాల్గొన్నారు.

### మాల జన సేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకన్న

చివ్వెంల, అక్టోబర్ 31 : మాల జనసేన సంయుక్త రాష్ట్ర కార్యదర్శిగా మర్రి వెంకన్న నియమితులయ్యారు. మంగళవారం మండలంలోని ఐలాపురంలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో వెంకన్నను నియమించినట్లు మాల జనసేన రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.